అక్కచెల్లెమ్మలకు ‘ఆసరా’

- ఇప్పటికి మూడు విడుతల్లో నగదు జమ
- నియోజకవర్గంలో 3,052 మహిళలకు రూ.16.62కోట్ల రుణాలు మాఫీ
- సంతోషం వ్యక్తం చేస్తున్న పొదుపు సంఘాల సభ్యులు



పొదుపు సంఘాల మహిళల సమావేశం(ఫైల్)

కల్లూరు: మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. వారికి అన్ని విధాలుగా అండగా నిలబడుతున్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పొదుపు సంఘాల(డ్వాక్రా సంఘాల) మహిళలకు రుణ మాఫీ చేశారు. 2019 ఏప్రిల్ 11 నాటికి స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీల అప్పు నిల్వ మొత్తాన్ని నాలుగు విడతలుగా విడుదల చేస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే మూడు విడతల ద్వారా ఆసరా సాయం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి సాయం అందజేయడంతో పొదుపు సంఘాల మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నాడు టీడీపీ సర్కారు మోసం

2014 ఎన్నికల్లో పొదుపు సంఘాల రుణాలను మాఫీ చేస్తామని టీడీపీ హామీ ఇచ్చింది. అధికారంలోకి రాగానే మాఫీ హామీని చంద్రబాబు పట్టించుకోలేదు. నమ్మి రుణం చెల్లించని పొదుపు మహిళలు ఆ తర్వాత తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో అక్కచెల్లెమ్మల బాధలను కళ్లారా చూసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఏప్రిల్ నాటికి ఉన్న పొదుపు సంఘాల బ్యాంక్ లింకేజీ రుణాలను మాఫీ చేస్తానన్ని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా అమల్లోకి తెచ్చారు.

నియోజకవర్గంలో 33,572 మందికి లబ్ధి

పాణ్యం నియోజకవర్గంలో 3052 పొదుపు సంఘాల గ్రూపులు ఉన్నాయి. వీటిలో మొత్తం 33,572 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఈ ఏడాది వైఎస్సార్ ఆసరా మూడవ విడత కింద నియోజకవర్గంలో రూ.16.62కోట్లు రుణాలు మాఫీ అవడంతో పొదుపు సంఘాల మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా లబ్ధిదారుల వివరాలు

మండలం	పొదుపు మహిళలు	మాఫీఅయిన నగదు రూ.కోట్లలో
పాణ్యం	749	4.27
గడివేముల	597	2.12
ఓర్వకల్లు	875	5.29
కల్లూరు	831	4.94
మొత్తం	3052	16.62(కోట్లు)

జీవనోపాధి మెరుగుదలకు కృషి



రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోంది. ఇందుల్లో భాగంగా వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, చేయూత వంటి పథకాలతో జీవనోపాధులను మెరుగు పరుచుకునేల ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకునేల అవగాహన కల్పిస్తున్నాం. వైఎస్సార్ ఆసరా కింద మూడవ విడత కింద మండలంలో 831 పొదుపు సంఘాలకు చెందిన 8,621 మంది సభ్యులకు రూ. 4.94కోట్ల రుణా మాఫీ అయ్యింది. - శ్రీనివాసగౌడ్, ఏపీఎమ్(వైఎస్సార్‌క్రాంతి), కల్లూరు

సీఎంకు రుణ పడి ఉంటాం



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పొదుపు సంఘాల మహిళలకు రుణాలను మాఫీ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణ పడి ఉంటాం. వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద మా గ్రూపుకు (వరలక్ష్మి) రూ.4లక్షలు మాఫీ అయ్యింది. ఇప్పటికే రెండు సార్లు పొదుపు రుణాలను మాఫీ చేయడంతో పొదుపు సంఘం (డ్వాక్రా సంఘాల) సభ్యులందరి తరుపున ధన్యవాదములు. - బి.అనురాధ, గడివేముల ఐక్య సంఘం అధ్యక్షురాలు

చాలా సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు మహిళలకు ఆసరా పథకం కింద రుణాలు మాఫీ చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. నేను సంతోషి మాత గ్రూపులో ఉన్నాను. మా గ్రూపునకు వైఎస్సార్ ఆసరా పథకింద ఒక్కో సభ్యురాలుకి రూ.29,700 రుణం మాఫీ అయింది. జీవనోపాధులు మెరుగు పర్చుకునేల అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. - పుష్పావతి, సల్కాపురం, కల్లూరు

క్లుప్తంగా

వరి సాగులో మెలకువలు పాటించాలి



వైఎస్సార్ పొలంబడిని నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

సి.బెళగల్: రైతులు వరి పంటల సాగులో మెలకువలు పాటించాలని ఏడీఏ వేదమణి అన్నారు. శుక్రవారం మండలంలోని గుండ్రేవుల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ వరి పొల్లాల్లో వైఎస్సార్ పొలం బడిని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఏడీఏ రైతులకు వరి పంట సాగువిధానంపై అవగాహన కల్పించారు. ఎరువుల వినియోగం, తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు, పంటల సంరక్షణ పద్ధతులను రైతులకు వివరించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



బిలకలగూడూరులో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి పాలు పట్టిస్తే తల్లీబిడ్డకు శ్రేయస్కరమని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ తేజస్వినీ తెలిపారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బందితో పాటు ఏఎన్‌ఎంలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ తేజస్వినీ మాట్లాడుతూ బిడ్డకు ముర్రుపాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధకశక్తి పెరగి శిశువుకు రోగాలు దరిచేరవన్నారు. కొంత మంది అవగాహన లోపంతో బిడ్డకు ముర్రుపాలు ఇవ్వక పోవడంతో వివిధ రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మనోహర్, వైద్యసిబ్బంది రాజ్‌కుమార్, ఉత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటల్లో తెగుళ్లను గుర్తించండి



మొక్కజొన్న పంటలో తెగుళ్లను వివరిస్తున్న దృశ్యం

గడివేముల: రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట, మినుము, సోయాబీన్, పత్తి పంటలలో తెగుళ్లను గుర్తించడం ఎంతో అవసరమని నంద్యాల ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సరళమ్మ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని బిలకలగుడూరు గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. పంటలో తెగుళ్లు ఆశించిన మొక్కలను పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ సరళమ్మ మట్లాడుతూ మొక్కజొన్నలో కాండం తొలిచే పురుగు, మినుములో పల్లాకు వైరస్ తెగులు సోకినట్లు గుర్తించామని, రైతులకు నివారణ పద్ధతులను వివరించామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఆధికారి ప్రభావతమ్మ, ఏఓ హేమసుందర్‌రెడ్డి, వీఏఏ విజయ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు : ఖరీఫ్ సీజన్ కింద సాగు చేసిన పంటలను రైతులు నిత్యం పరిశీలిస్తూ వాటికి సోకే తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతులంతా సాగుచేసిన పంటలకు మోతాదుకు మించి ఎరువులను వాడకుండా అవసరమైన ఎరువులను మాత్రమే వినియోగించుకోవాలన్నారు. ఆర్‌బీకే సిబ్బంది జయంత్, విజయశాంతి పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని అరికట్టాలి



గచ్చులో దోమల లార్వాను చూపుతున్న డాక్టర్ ప్రవీణ్ కుమార్

కర్నూలు(న్యూటౌన్) : వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి దోమల వ్యాప్తిని అరికట్టాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కర్నూలు మండలం గార్గేయపురం గ్రామంలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్యసిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా జ్వరం లక్షణాలు కలిగి ఉంటే వెంటనే వారికి నిర్ధారణ పరీక్షలు చేసి వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. పరిసరాల్లో నీటి నిల్వలు, చెత్తకుప్పలు నిల్వ లేకుండా తొలగించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వెంకటరమణ, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబలైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు ప్రారంభం

కర్నూలు కల్చరల్: ఆంధ్ర ప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఆర్‌ఐవో గురవయ్య శెట్టి, కర్నూలు డివిజన్ ఉప విద్యాధికారి హనుమంతరావు పేర్కొన్నారు. శుక్రవారం ఏపీఓఎస్ఎస్ ప్రవేశాలపై ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు సమగ్ర శిక్ష అభియాన్ సమావేశ మందిరంలో అవగాహన కల్పించి, ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

● 9 నుంచి ఆజాదికా అమృత్ మహోత్సవం

కర్నూలు(అగ్రికల్చర్): స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు ఆజాదికా అమృత్ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయం నుంచి ఏపీడీలు, ఏపీవోలు, ఈసీలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద 75 మొక్కలు నాటాలని సూచించారు. అలాగే జిల్లాలోని ప్రతి మండలంలో 10 రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు నిర్మించడంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.

● 6న గణేష్ ఉత్సవ సమితి సమావేశం

కర్నూలు కల్చరల్: కర్నూలు విభాగ్ (ఉమ్మడి కర్నూలు జిల్లా) శ్రీగణేష్ ఉత్సవ సమితి సమావేశం ఈనెల 6వ తేదీ ఉదయం 9.30 గంటలకు స్థానిక వినాయక ఘాట్ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయం సమావేశ మందిరంలో జరుగుతుందని జిల్లా సంఘటనా కార్యదర్శి ఎం.నాగఫణిశాస్త్రి తెలిపారు. వినాయక చవితి పర్వదినాన్ని ఈ సంవత్సరం సెప్టెంబర్ 18వ తేదీన నిర్వహించుకోనున్న నేపథ్యంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కేంద్ర ఉత్సవ సమితి ప్రతినిధులతో పాటు మండల ఉత్సవ సమితి సభ్యులు సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య

- వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య
- 19వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

కల్లూరు : నవరత్నాల సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. వారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. మహిళలను, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి బుక్‌లెట్లను పంపిణీ చేశారు. కాలనీలో ఎవైన సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని, సమస్యలు పరిష్కరించేందుకే మేమంతా గడప గడపకు వస్తున్నామన్నారు. కాలనీ వాసులు తాగునీరు పైపులైన్ వేయించాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, మురుగు కాలువలు నిర్మించాలని, సీసీ రోడ్లు వేయాలని సమస్యలను తెలియజేశారు. ఆయా సమస్యలను సకాలంలో పరిష్కారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు

వర్ష కాలంలో నగరాన్ని శుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికులకు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రెయిన్‌కోట్లను ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య అందించారు. కార్మికుల పట్ల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్మికులందరికి జీవిత/ప్రమాద బీమమా చేయించామని, ప్రతి ఏటా వస్త్రాలు, కిట్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత వాన కాలంలో కార్మికులు తడవకుండా ఉండేందుకు రూ. 3.85 లక్షలతో వెయ్యి మంది పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్లను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీర శైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు అరుణ, శ్వేతారెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ‘గడప గడపకు’

- పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల లబ్ధి
- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- కోడుమూరులో ‘గడప గడపకు మన ప్రభుత్వం’



మాలవీధిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. శుక్రవారం కోడుమూరులోని వెంకటగిరి రోడ్డు, మాలవీధి, శాంతినగర్‌లలో ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. అలాగే వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలిచ్చారు. ఏళ్ల తరబడి జీవిస్తున్న తమ కాలనీల్లో ఇప్పటికీ కరెంట్ స్తంభాలు లేవని, సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మించలేదని, వర్షాకాలమొస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సీసీరోడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని పీఆర్ ఏఈ గంగరాజు, ఎంపీడీఓ చంద్రశేఖర్‌లను ఆదేశించారు.

పార్టీలకతీతంగా జగనన్న సంక్షేమ పథకాల లబ్ధి

సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి పార్టీలకతీతంగా అర్హులైన వారందరి గడపకు చేరుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా ఏడాదికి రూ.24వేలు అందజేస్తూ చేనేత కార్మికులను ఆదుకున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ పాలన కొనసాగిస్తున్న జగనన్నను ప్రజలంతా మరోసారి ఆశ్వీరదించి గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు, ఏఓ రవిప్రకాష్, ఏపీఎం పుష్పావతి, హౌసింగ్ ఏఈ లక్ష్మన్న, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, స్థానిక నేతలు అద్దుగల రాజశేఖర్‌రెడ్డి, లాయర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులకు 575 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు రూరల్ : సుంకేసుల రిజర్వాయర్‌కు ఎగువ నుంచి 575 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని శుక్రవారం డ్యాం జేఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వరదనీటి రాక తగ్గిపోవడంతో దిగువకు నీటి విడుదలను నిలిపివేశామని, కేసీ కెనాల్‌కు మాత్రం 130 క్యూసెలక్కులను విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం డ్యాంలో 1.068 టీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

సచివాలయాల్లో ‘స్పందన’ నిర్వహించాలి

సి.బెళగల్: మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రతిరోజూ స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని కొత్తకోట, ఈర్లదిన్నె గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో అందుతున్న సేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు.

వైఎస్సార్ పోషణతో సంపూర్ణ ఆరోగ్యం

గడివేముల: వైఎస్సార్ సంపూర్ణ పోషణతో గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ పుల్లయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కరిమద్దెల సచివాలయంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దేవేంద్రనాథ్‌రెడ్డి, మహమ్మద్ ఉశేన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను పకడ్బందీగా రూపొందించాలి

కర్నూలు(న్యూటౌన్) : ఓటర్ల జాబితాను పకడ్బందీగా, పారదర్శకంగా రూపొందించాలని కర్నూలు ఆర్డీవో సి.హరిప్రసాద్ బీఎల్‌ఓలను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కర్నూలు మండలం బి.తాండ్రపాడులో ఇంటింటా ఓటర్ల సర్వే రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి మొబైల్‌లో ఓటర్ల పూర్తి వివరాలను నమోదు చేయాలని చెప్పారు. సవరణలతో పాటు ఫొటో, అడ్రస్ మార్పులు వంటివి ఓటరు ఆమోదంతో చేయాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికలు మరో 9 నెలల్లో జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ 2024 కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందని చెప్పారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్ల నిండే ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేసి 2024 జనవరి 5వ తేదీ తుది జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించనుందని స్పష్టం చేశారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కర్నూలు ఆర్‌డీఓ వెంట కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో తుమ్మలవాగుపై రాకపోకలు



తుమ్మలవాగు బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని కర్నూలు నుంచి ఉల్చాల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో కూలినపోయిన తుమ్మలవాగు బ్రిడ్జిపై ఎమర్జెన్సీ వర్క్ కింద పనులు చేపట్టి రెండు రోజుల్లో రాకపోకలను పునరుద్ధరిస్తామని ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, ఈఈ సురేష్‌బాబు స్పష్టం చేశారు. శుక్రవారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలోని కూలిన తుమ్మలవాగు బ్రిడ్జిని ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, ఈఈ సురేష్‌బాబు, డీఈ విజయభారతి, ఏఈఈ ఫణిరామ్, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, ఉల్చాల గ్రామ సర్పంచ్ విద్యాసాగర్ పరిశీలించారు. ఎస్ఈ మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం తుమ్మలవాగుపై బ్రిడ్జి నిర్మించారన్నారు. గురువారం సాయంత్రం కర్నూలు వైపు నుంచి రాళ్ల లోడ్‌తో ఉల్చాలకు వెళ్తున్న ట్రాక్టర్ బ్రిడ్జిపై వెళ్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిందన్నారు. డ్రైవర్ వెంటనే అప్రమత్తమై వెంటనే ట్రాక్టర్ దిగడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. ఆయా గ్రామ ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా ఎమర్జెన్సీ వర్క్ కింద పనులు చేపడుతామన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు



గూడూరులో మాట్లాడుతున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

గూడూరు రూరల్: ఉపాధి పనుల్లో సిబ్బంది అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి హెచ్చరించారు. గూడూరులో 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశానికి శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గతేడాది ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు మండల వ్యాప్తంగా రూ.6.35 కోట్లను ఉపాధి పనులకు ఖర్చు చేయడం జరిగిందన్నారు. గ్రామాల వారీగా తనిఖీ బృందాలు పర్యటించి క్షేత్ర పరిశీలన, తనిఖీలు నిర్వహించారని చెప్పారు. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారి నుంచి రూ. 25411లను రీకవరీ చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీవీఓ సిద్ధలింగామూర్తి, వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ సలీంబాషా, ఎఫ్ఎం ఆదెయ్య, ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ మౌలాలి, ఎంపీడీఓ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

ఉల్చాల సహకార సంఘానికి అవార్డు



మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సొసైటీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డి

కర్నూలు(న్యూటౌన్): కర్నూలు మండలం ఉల్చాల వ్యవసాయ పరపతి సహకార సంఘానికి ఆప్కాబ్ డైమండ్ జూబ్లీ అవార్డు లభించినట్లు సహకార సంఘం చైర్మన్ వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు సహకార వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు వెల్లడించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 2022-23 ఆర్థిక సంవత్సరానికి రైతులకు అందించిన ఉత్తమ సేవలను పరిగణలోకి తీసుకుని ఆప్కాబ్ డైమండ్ జూబ్లీ అవార్డుకు ఎంపికై నట్లు చెప్పారు. సొసైటీ ద్వారా రూ.18 కోట్ల టర్నోవర్‌తో 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.7 లక్షల లాభాలు ఆర్జించినట్లు తెలిపారు. ఉల్చాల వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి రైతులందరూ సకాలంలో రుణాలు చెల్లించడంతో ఉత్తమ పురస్కారానికి ఎంపికై ందని చెప్పారు. అనంతరం వ్యవసాయ సహకార సంఘం సీఈఓ హరినాథరెడ్డి మాట్లాడుతూ ఉల్చాల వ్యవసాయ సహకార సంఘానికి రైతుల సహకారంతోనే ఆప్కాబ్ డైమండ్ జూబ్లీ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, సీఈఓ రామాంజనేయులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే వేగంగా చేయాలి



వీఆర్‌ఓలతో మాట్లాడుతున్న కర్నూలు ఆర్డీఓ హరి ప్రసాద్

కర్నూలు (న్యూటౌన్): రైతుల సహకారంతో మండల పరిధిలో జరుగుతున్న భూముల రీ సర్వే వేగంగా, పకడ్బందీగా చేయాలని కర్నూలు ఆర్డీఓ సి హరి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కర్నూలు మండలం బీ తాండ్రపాడులో రీ సర్వే చేసిన రికార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ భూముల రీ సర్వేకు సంబంధించి ఆయా గ్రామాల్లోని రైతులకు ముందుగానే తెలియజేసి, గ్రామాల్లో దండోరా వేయించి, సమాచారం అందించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ భూములకు సంధించి రీ సర్వే చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిందని, అందుకు ఆయా గ్రామాల్లోని రైతులు భూముల రీ సర్వేకు సంపూర్ణంగా సహకారం అందిస్తే వేగంగా, సులభంగా పూర్తవుతుందన్నారు. కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు, వీఆర్‌ఓలు, సర్వే సహాయకులు పాల్గొన్నారు.

నేడు ‘గడప గడపకు మన ప్రభుత్వం’

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని సచివాలయం-4 పరిధిలో శనివారం గడప గడపకు-మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి తెలిపారు. ఉదయం 8గంటలకే కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొంటారని, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, తప్పక హాజరు కావాలన్నారు.

దొడ్డిపాడు గ్రామంలో..

కల్లూరు: మండల పరిధిలోని పెద్దటేకూరు గ్రామ పంచాయతీ మజరా గ్రామమైన దొడ్డిపాడు గ్రామంలో శనివారం సాయంత్రం గడప గడకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎమ్మెల్యే కార్యాలయ అధికారులు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతరన్నారు. కావున మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

నేడు వెంకటగిరిలో ..

కోడుమూరు రూరల్ : మండలంలోని వెంకటగిరి గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరించడంతో పాటు, సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొనాలని కోరారు.



● పచ్చ తోరణం

మండల పరిధిలోని పాణ్యం-ఆలమూరు గ్రామాల మధ్య రోడ్డుకిరువైపులా ఉన్న భారీ చెట్లు వాహనదారులకు చల్లటి నీడను, ఆహ్లాదకరమైన గాలిని పంచిపెడుతున్నాయి. దీంతో ఈ రోడ్డుపై వెళ్లే వారు కాసేపు చెట్ల కింద సేదతీరిన తర్వాత తమ గమ్యస్థానాలకు బయలుదేరుతున్నారు. అంతలా చెట్లు ఏపుగా పెరిగి పచ్చటి తోరణం కట్టినట్లు ఇరువైపులా కొమ్మలు కలిసిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు, చెట్లకు అందుబాటులో నీరు పుష్కలంగా ఉండడంతో పచ్చగా ఉంటున్నాయి. - పాణ్యం